దాతృత్వాన్ని గౌరవించండి..దాహార్తి తీర్చండి

- మాచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో మూతబడిన వాటర్ ప్లాంట్
- తాగునీటి అవసరాలు తీర్చేందు కేసీపీ యాజమాన్యం ఏర్పాటు
- చిన్న చిన్న మరమ్మతులు కూడా చేపట్టలేని ఆర్టీసీ అధికారులు
- వేసవిలో తాగునీటి అవసరాన్ని గుర్తించాలంటున్న ప్రయాణికులు
- మరమ్మతుల వెనుక బస్టాండ్ వ్యాపారుల చేతివాటం?

మాచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో దాతల ఔదార్యంతో నిర్మించిన వాటర్ ప్లాంటు అధికారుల నిర్లక్ష్యంతో మూలన పడింది. వేసవిలోనైనా ప్రయాణికుల దాహార్తిని తీర్చాలనే ఆలోచన మాత్రం అధికారులకు రాకపోవడం బాధాకరం. ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు లక్షలాది రూపాయలతో కేసీసీ సంస్థ వాటర్ ప్లాంట్‌ను నిర్మించింది. అధికారుల నిర్లక్ష్యంతో అది కాస్త మూతబడడంతో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని గదిలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మిషనరీ

మాచర్లరూరల్: మాచర్ల పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్థానిక కేసీపీ సిమెంట్స్ యాజమాన్యం 2014లో సుమారు రూ.6 లక్షల వ్యయంతో ప్రయాణికుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను నిర్మించింది. కొన్ని నెలలు వాటర్ ప్లాంట్ ప్రయాణికులకు బాగానే ఉపయోపడింది. వారి దాహార్తిని తీర్చింది. కానీ, వాటర్ ఫిల్టర్‌లో చిన్న చిన్న మరమ్మతులు అధికారులు పట్టించుకోలేదు. దీంతో ప్లాంట్ పూర్తిగా మూలనపడింది. ఈ వాటర్ ప్లాంట్ వినియోగంలోకి వస్తే తమ వాటర్ బాటిల్స్ వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుందని బస్టాండ్ ఆవరణలో ఉన్న కూల్ డ్రింక్స్, టీస్టాల్స్ నిర్వాహకులు వాటర్ ప్లాంట్ నీటి సరఫరా పైపులైన్‌ను పగలగొట్టారనే ఆరోపణలున్నాయి.

ప్రయాణికుల ప్రయోజనం పట్టదా?

నియోజకవర్గానికి కేంద్రంగా ఉండి హైదరాబాద్, గుంటూరు, నల్గొండ, మార్కాపురం, నర్సరావుపేట, పిడుగురాళ్ళ, చెన్నై, బెంగుళూరు, తిరుపతి వంటి పట్టణాలకే కాకుండా వందలాది గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించేందుకు మాచర్ల బస్టాండ్ కేంద్రం. ఇక్కడకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. వారి దాహార్తిని తీర్చేందుకు బస్టాండ్‌లోని వాటర్ ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. వేసవిలో పల్నాడు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఈ ప్రాంతంలో మంచినీటి కొరత కూడా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ప్రదేశంలో వాటర్‌ప్లాంట్ కూడా ఎంతో అవసరం. ఉచితంగా అందించే వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంది. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన కేసీపీ సంస్థ ప్రతినిధులను సంప్రదించగా ప్లాంట్ మరమ్మతుల ఖర్చు తాము భరిస్తామని, తమ సంస్థలో టెక్నీషియన్స్, సామగ్రి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడాలనేది తమ ఉద్దేశమని, ఆర్టీసీ అధికారులు ఇందుకు స్పందిస్తే సహకరిస్తామని వారు చెబుతున్నారు.



కేసీపీ సంస్థ ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల కోసం నిర్మించిన వాటర్‌ప్లాంట్

ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం



బస్టాండ్ ప్రాంగణంలో కేసీపీ సంస్థ నిర్మించిన వాటర్ ప్లాంట్ నేను బాధ్యతలు చేపట్టక ముందు నుంచే నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్లాంట్‌లోని సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించి, వాటర్ పైప్‌లైన్, తాగునీటి కుళాయిలను ప్రయాణికులందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నాం.నిందుకు కేసీపీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారాన్ని కోరతాం.

– వీరాస్వామి, ఆర్టీసీ డీఎం, మాచర్ల

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్లు కృష్ణ, సుభాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపురంలోని సుద్దమ్మ హోటల్ పక్కనే ఉన్న పార్టీ కార్యాలయంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య పాల్గొని విజయంతం చేయాలని పేర్కొన్నారు.

బెల్టు షాపులను మూసివేయించాలి

దాచేపల్లి : దాచేపల్లి మండల పరిధిలో ఉన్న బెల్టు షాపులను ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే మూసివేయించాలని రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు మోమిన్ సైదల్లి మంగళవారం డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మంచినీరు దొరకడం కష్టమవుతున్న రోజుల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. అన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేసే షాపుల లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.

విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలి

దాచేపల్లి: రైతులంతా రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని ఏవో పాపకుమారి అన్నారు. మండలంలోని గామాలపాడు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతుల సమావేశం జరిగింది. రైతు విశిష్ట సంఖ్య నమోదుపై ఏఓ పాపకుమారి అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే వ్యవసాయ పనిముట్లతో పాటు, పంట నష్ట పరిహారం , ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య ఉండాలన్నారు. రైతులందరూ తప్పనిసరిగా సంఖ్య నమోదుకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. రైతు సేవ కేంద్రాల్లో నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. సిబ్బంది కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య హనుమత్ స్వామి వారి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతార్చణ, శత చండీహోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. రామతారక మంత్ర హోమం, ఆంజనేయ హోమం, సుబ్రహ్మణ్య హోమం, క్షేత్రపాలక మండప దేవతా హోమంలు నిర్వహించారు.

విక్రయ హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పరిధిలోని దుకాణాలలో విక్రయహక్కులకై మంగళవారం వేలం నిర్వహించినట్లు మండల దేవాలయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కుకు రూ.1,03,000, క్యాంటిన్, కూల్ డ్రింక్స్ విక్రయాలకు రూ.1,03,000, ప్రసాదాలు విక్రయించుకునే హక్కుకై రూ.50,000 లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ మూడింటిపై రూ. 2,56,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు, చిత్రపటాలు అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కులకు వేలంలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. సత్తెనపల్లి దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వి.లీలావతి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

350 పశువులకు వ్యాక్సినేషన్

క్రోసూరు: మండలంలోని అందుకూరు, అనంతవరం గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. రెండు గ్రామాల్లో మొత్తం 350 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు, బ్రూసెల్లోసిస్ నివారణ వ్యాక్సిన్లు వేసినట్లు చెప్పారు. ఈనెల 31 వరకు జరిగే శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, పాల్గొన్నారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం



బొల్లాపల్లి: నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బ్రిడ్జి తండా, బోడిపాలెం తండాల్లో నాటు సారాయి నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటుసారాయి తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తయారు చేయడం, రవాణా చేయడం, నాటుసారా కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాసరావు, రెహమాన్, సిబ్బంది, తండా వాసులు పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నాలని కోరారు. అలాగే ఉదయం 10 గంటలకు నర్సరావుపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి యువతపోరు ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకోవాలని, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో జరగనున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాచవరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.వెంగళరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

నవ ధాన్యాలు సాగు.. భూమికి బాగు



విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెంటచింతల: నవ ధాన్యాలు సాగు చేయడం వలన భూమికి ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతలలోని వెలుగు కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో అన్ని శాఖలు సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఏ విధంగా అవగాహన కల్పించాలో చర్చించడం జరిగిందన్నారు. మార్చి, ఏప్రిల్, మే మాసాలలో రైతులందరూ పీఎండీఎస్ పద్ధతిని అవలంబించి, వారి పంట పొలాలను సారవంతం చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడానికి వారిలో చైతన్యం తీసుకువచ్చి, ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ముందుగా విత్తన గుళికల తయారుచేయడంపై అవగాహన కల్పించి అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. మాస్టర్ ట్రైనర్ వినోద, ఏపీఎం దాసు, యూనిట్ ఇంచార్జ్లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



విత్తన గుళికలు తయారుచేసే విధానాన్ని చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

దొడ్లేరు(కోసూరు): రైతులు ప్రకృతి వ్యవసాయబాటలోనే ముందుకు సాగాల్సిన అవసరం ఉందని క్రోసూరు ఏడీఏ హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్లేరు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖల మండలం స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అధ్యక్షతన నిర్వహించగా క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. రాబోయే ఖరీఫ్‌కు ముందు ప్రతి ఒక్క రైతు తన పొలం లో పీఎండీఎస్(నవ ధాన్య విత్తనాలు)చల్లాలని సూచించారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ రైతులు పీఎండీఎస్ విధానం ఆచరించాలన్నారు. మండల ఏఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని వీటి వలన చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన ఆదాం అనే రైతుకు బెస్ట్ ఫార్మర్ అవార్డుతో సత్కరించారు. అనంతరం వేసవిలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో ప్రదర్శన చేసి చూపించారు. మండల ఏపీఎం కృపావేణి, హార్టికల్చర్ అసిస్టెంట్, మండల సీసీలు, జిల్లా సిబ్బంది అప్పలరాజు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ జయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ వెలుగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రయాలు నిషేధం

ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి

అచ్చంపేట: రహస్య స్థావరాలలో బట్టీలు పెట్టి సారా కాసినా, కాసిన సారాను విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయి, తాడువాయి తండాలలో ఎక్సైజ్ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నాటుసారా కాసినా, విక్రయించినా నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దొంగతనంగా అడవులలో బట్టీలు ఏర్పాటు చేసి సారా కాయడం నేరమన్నారు. అలా కాసిన సారా తాగడం వల్ల అనారోగ్యం పాలవుతారన్నారు. సారాకు బానిసలవ్వవద్దని, నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు చెప్పారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

అగ్రహారం భూముల్లో భాగస్వామ్యం తప్పనిసరి

తహసీల్దారు ఎ.నళిని



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు నళిని

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని అంగలూరు గ్రామంలో అగ్రహారం భూములకు సంబంధించి గ్రామసభను రెవెన్యూ అధికారులు, ఉత్తరాదిమఠం ప్రతినిధులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో తహసీల్దారు ఎ.నళిని పాల్గొని మాట్లాడుతూ నిబంధనలు మేరకు, కలెక్టరు ఆదేశాలకు అనుగుణంగా అగ్రహారం భూములకు సంబంధించి పరిష్కరించే దిశలో భాగంగా రైతులు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. అంగలూరు గ్రామంలో 1264 ఎకరాలు గ్రామ విస్తీర్ణం ఉండగా అందులో 905 ఎకరాలు బెంగుళూరు ఉత్తరాది పీఠానికి చెందగా, మిగిలిన భూములన్నీ సర్వీసు ఈనాం ప్రభుత్వ భూములుగా నిర్ధారించారు. గ్రామసభలో పాల్గొని రెవెన్యూ అధికారులు, రైతులు మాట్లాడిన అంశాలతో పాటు ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో రైతులందరూ ఐక్యంగా కమిటీగా ఏర్పడితే, ఉత్తరాది మఠం కమిటీ సభ్యుల దృష్టికి తీసుకొని వెళ్లి రైతులకు న్యాయం చేస్తామని ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే జిల్లా గజిట్ ఫాం–1, ఫాం–2 నో టీసులు ప్రచురణ చేశామని, రైతులు, ఉత్తరాది మ ఠం ప్రతినిధుల సమక్షంలో సర్వే జరుగుతుందని తహసీల్దారు తెలిపారు. సర్వే పనులు పూర్తయిన తర్వాత రైతులు, ఉత్తరాది మఠం ప్రతినిధులతో మళ్లీ చర్చించి జిల్లా కలెక్టరు ఆదేశాలకు మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దారు వెల్లడించారు. ఈ గ్రామసభలో మండల సర్వేయర్ పవన్ కుమార్, ఏవో రామినేని రామారావు, వీఆర్వో కాకర్లబోయిన వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయర్ కిరణ్, పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటలు ఎంతో మేలు



మాచవరం: పంటల అనంతరం వేసవిలో లోతు దుక్కులు దున్నుకొని వీలైనంత వరకు ఖరీఫ్ పంటకు ముందు రైతులు పచ్చిరొట్ట పంటలు వేసుకుంటే ఎంతో మేలని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట పంటలు వేసుకునే రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. పొలం కలిగిన ఉన్న ప్రతి ఒక్కరు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని తెలియజేసారు. గ్రామాల్లో చేపడుతున్న పీ–4 సర్వేకి ప్రజలు సహకరించాలన్నారు. ఏఓ కె.రామమ్మ, వీఏఏలు ఎం.గోపీ, సీహెచ్ వంశీ, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరావు , వీఆర్‌ఓ వై.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో బాలబాట



గురజాల: స్థానిక ఎస్సీ కాలనీలో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ఏరియా కో–ఆర్డినేటర్ బి.దయామని విద్యార్థులకు సిలబస్ మెటీరియల్ అందించారు. పేద విద్యార్థులు చదువుకునేందుకుగాను బాలబాట కార్యక్రమం నిర్వహించి, ప్రవేశ పరీక్షలు రాసే విధంగా చూస్తున్నామన్నారు. కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నరసరావుపేట టౌన్: అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో గృహోపకరణాలు మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటప్పకొండ రోడ్డు వెంగళరెడ్డి కాలనీకు చెందిన షేక్ నాగూర్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. గృహంలోని వస్తువులు, గృహోపకరణాలు, దుస్తువులు, దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటనలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

మాదలలో ప్రత్యేక వైద్య శిబిరం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన బెల్లం మహాలక్ష్మమ్మ అనే మహిళ జ్వర లక్షణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ మేర గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులతో వైద్యాధికారి జయకృష్ణ ప్రవీణ్, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్‌రాణిలు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. అలాగే ఇళ్లలోను, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులను అందించారు. గ్రామంలో ఫాగింగ్ చేయించారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఈ పి.విజయ్‌కుమార్

మాచవరం: విద్యుత్‌ను అవసరాలను అనుగుణంగా పొదుపుగా వాడుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగేశ్వరపురం తండా గ్రామంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా మండలంలోని పిన్నెల్లి, మాచవరం, మోర్జంపాడు, చెన్నాయపాలెం, కొత్త గణేశునిపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను సందర్శించారు. సబ్‌స్టేషన్ పరిసరాలను, కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. రానున్న వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. అనంతరం నాగేశ్వపురం తండాలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు తప్పనిసరిగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ కొరకు ఎస్సీ, ఎస్టీలకు రూ.2 లక్షల వరకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఈఈ నూతలపాటి సింగరయ్య, డిప్యూటీ ఈఈ తుమ్మల వీరేశ్వరావు, ఏఈఈ భగవాన్, ఎల్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బోధకాలు నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుచరిత

దాచేపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వల్ల బోధకాలు నివారించవచ్చని దాచేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ సుచరిత అన్నారు. జాతీయ బోధకాలు నివారణ దినోత్సవం సందర్భంగా తంగెడ, కేశానుపల్లి, గామాలపాడు, పొందుగల గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. బోధకాలు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలు, బావులు అధికంగా ఉండే గ్రామాల్లో లార్వా ఉత్పత్తి పెరగడం వల్ల బోధకాలు సోకుతుందని చెప్పారు. అనంతరం బోధకాలు సోకిన వ్యక్తులకు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పట్టాభి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: కేంద్రప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించటం సరికాదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు విమర్శించారు. యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద సమ్మె సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు సిబ్బందికి వారంలో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని కోరారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అన్ని తరగతుల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టెంపరరీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24,25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

క్రోసూరు: క్రోసూరులో బుధవారం జరగనున్న అభయాంజనేయ స్వామి 32 అడుగుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. పుణ్య దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు. నవగ్రహాలను, దేవీ దేవతలను ప్రసన్నం చేసుకొనేందుకు, ఆవాహనం చేసుకొనేందుకు సంబంధించిన యజ్ఞ యాగాలు నిర్వహించారు. ఈ యజ్ఞాలలో క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి 32 అంగుళాల రాతి విగ్రహాన్ని శుద్ధిచేసి, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి పీఠాధిపతులైన రుద్ర యోగేశ్వరస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకై అహర్నిశలు కృషి చేసిన గ్రామ పెద్ద కాంద్రు కాశయ్యను ఆలయ కమిటీ, భక్తులు సన్మానించారు.